గ్రామీణ నీటి సరఫరాకు..

బాలయ్య ఇలాఖా.. బెల్టుషాపు మోత..!

రాష్ట్రంలోనే హిందూపురం నియోజక వర్గానికి ఒక ప్రత్యేక గుర్తింపు ఉంది. ముఖ్యమంత్రి స్వయాన బామ్మార్ది, సినీ నటుడు నందమూరి బాలకృష్ణ ఈ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా ప్రాతినిథ్యం వహిస్తుండడంతో ఈ ప్రాంతానికి ప్రత్యేక గుర్తింపు ఉంది. అలాంటి బాలయ్య ఇలాఖాలో ఊరూవాడా బెల్టు షాపులు దర్శనమిస్తున్నాయి. ఎక్సైజ్ అధికారులు చర్యలు తీసుకోవాలంటే షాపుల్లో అధికార పార్టీ నేతల హస్తం ఉండడంతో వారు వెనుకడుగు వేస్తున్నారు. గత మూడు రోజుల క్రితం బెల్టు షాపులపై మహిళలు స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేశారంటే ఇక్కడి పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.

- విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు
- ప్రతి గ్రామంలోనూ రెండుకు పైగా బెల్టు దుకాణాలు
- క్వార్టర్‌పై రూ.20 అదనం
- కొన్నిచోట్ల లైసెన్స్ షాపుల తరహాలో ఏర్పాట్లు
- అధికార పార్టీ నేతల ఆధ్వర్యంలోనే నిర్వహణ

ప్రజాశక్తి-హిందూపురం

మద్యం విక్రయాలకు సంబంధించి ప్రభుత్వం చెబుతున్నదానికి క్షేత్రస్థాయిలో జరుగుతున్న దానికి సంబంధం లేకుండా ఉంది. లైసెన్స్ దుకాణాలకు అదనంగా వందల సంఖ్యలో బెల్టు షాపుల్లో నిత్యం మద్యం విక్రయాలు సాగుతున్నాయి. ప్రతి గ్రామంలోనూ రెండు, అంతకుమించి బెల్టు షాపులు నడుస్తున్నాయంటే అతిశయోక్తి కాదు. కొన్ని గ్రామాల్లో ప్రాంతాల వారీగా బెల్టు షాపులు సైతం ఏర్పాటు చేసిన పరిస్థితి ఉంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చిన తర్వాత కొత్త మద్యం పాలసీని తెచ్చింది. టెండర్ల ద్వారా మద్యం దుకాణాల కేటాయింపు చేపట్టింది. 2024 అక్టోబర్‌లో ఈ ప్రక్రియను పూర్తి చేసింది. శ్రీ సత్య సాయి జిల్లాలో సుమారు 98 ఉంటే హిందూపురం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో 13 మద్యం దుకాణాలకు లైసెన్స్‌లు ఇచ్చారు. మద్యం దుకాణాల్లో అధికార పార్టీ నేతల హస్తం ఉండటంతో అమ్మకాలపై నియంత్రణ అనేది పూర్తిగా లేకుండా పోయింది. నాయకులు కనుసన్నల్లో మద్యం దుకాణాలు నడుస్తుండటంతో ఎక్సైజ్ అధికారులు అటువైపు కన్నెత్తి చూడలేని పరిస్థితి నెలకొంది. ప్రతి లైసెన్స్ దుకాణానికి అనుబంధంగా పెద్దఎత్తున బెల్టుషాపులు నడుస్తున్నాయి. ఈ దుకాణాలు సైతం కూటమి పార్టీలకు సంబంధించిన అనుయాయుల చేతుల్లోనే ఉన్నాయి. ప్రతి గ్రామంలోనూ రెండుకుపైగా బెల్టుషాపులు ఉన్నాయి. అనుమతి ఉన్న షాపుల నుంచి బాటిళ్లు తీసుకెళ్లి బెల్టు షాపుల్లో విక్రయాలు సాగిస్తున్న పరిస్థితి ఉంది. బెల్టు షాపుల్లో క్వార్టర్ బాటిల్‌కు రూ.20 అదనంగా ధర నిర్ణయించి విక్రయిస్తున్నారు. దూరంగా ఉన్న మద్యం దుకాణాలకు వెళ్లలేక మందు బాబులు అత్యధికంగా బెల్టు షాపులలోనే మద్యం కొనుగోలు చేస్తున్నారు. చిన్నస్థాయి బెల్టు దుకాణంలో సైతం రోజుకు 50 బాటిళ్లు విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. కొన్ని బెల్టు దుకాణాల్లో వందల బాటిళ్ల విక్రయాలు సాగుతున్నాయి. కొన్నిచోట్ల బెల్టు దుకాణాలను సైతం లైసెన్స్ షాపుల తరహాలో ఏర్పాటు చేసి విక్రయాలు సాగించేస్తున్నారు. ఇదంతా బహిరంగంగా జరుగుతున్నా అధికారులు కనీస చర్యలు తీసుకోని పరిస్థితి ఉంది.

పర్మిట్లు లేకుండానే సిట్టింగ్ అమ్మకాలు

నిబంధనల ప్రకారం మద్యం లైసెన్స్ దుకాణాల వద్ద మద్యం బాటిళ్ల విక్రయాలు మాత్రమే సాగాలి. పర్మిట్లకు అనుమతిస్తేనే అక్కడ కూర్చుని తాగే (సిట్టింగ్) ఏర్పాటు చేయాలి. పర్మిట్లు లేకపోయినా మద్యం దుకాణాల వద్ద సిట్టింగ్ ఏర్పాటు చేసి మరీ మద్యం అమ్మకాలు సాగించేస్తున్నారు. ప్రతి మద్యం దుకాణంలోనూ అధికార పార్టీ నాయకుల అండదండలు ఉండడంతో ఎక్సైజ్ అధికారులు పట్టించుకోని పరిస్థితి ఉంది. పట్టణాల్లో యథేచ్ఛగా ఈ ప్రక్రియ సాగుతున్నా ఏఒక్కరికీ పట్టడం లేదు. పలు దుకాణాల్లో ఎంఆర్‌పికి మించి మద్యం విక్రయాలు సాగిస్తున్నా అడిగే నాథుడే కరువయ్యాడు. రాత్రి పది గంటలకు మద్యం దుకాణాలు మూసివేయాల్సి ఉన్నప్పటికీ చాలాచోట్ల రాత్రి 11 గంటలు, 12 గంటల వరకూ మద్యం అమ్మకాలు సాగుతున్నాయి. ప్రభుత్వ నిబంధనలు ఏ ఒక్కటీ మద్యం అమ్మకాల్లో అమలు కావడం లేదు.

యథేచ్ఛగా బెల్టు అమ్మకాలు

బెల్టు షాపులు ఎక్కడా లేవంటూ ఎక్సైజ్ అధికారులు మసిపూసి మారేడు కాయ చేసే ప్రయత్నం చేస్తున్నారు. ఎక్కడ బెల్టుషాపు ఉందో అధికారులకు తెలిసినా వాటిని తొలగించే చర్యలు తీసుకోవడం లేదు. హిందూపురం సమీపంలోని ముదిరెడ్డిపల్లి ప్రాంతానికి చెందిన కొంత మంది మహిళలు తమ ప్రాంతంలో ఉన్న బెల్టు షాపుపై చర్యలు తీసుకోవాలని మూడు రోజుల క్రితం వన్ టౌన్ స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేశారు. ఆ రోజు మాత్రం ఎక్సైజ్ సిఐ అక్కడికి వెళ్లి అలా చూసి ఇలా వచ్చారు. కొట్నూరులో గోరంట్లకు వెళ్లే రహదారిలో బార్ అండ్ రెస్టారెంట్ తరహాలో బెల్టు షాపు నిర్వహిస్తున్నా ఎవరూ పట్టించు కోవడం లేదు. వైసిపి ప్రభుత్వంలో మద్యం దోపిడీ ఒకలా ఉంటే.. కూటమి ప్రభుత్వంలో మరోలా కొనసాగుతుందని పలువురు అభిప్రాయ పడుతున్నారు.

బెల్టు దుకాణంలో అమ్మకానికి పెట్టిన మద్యం

మూడు రోజుల క్రితం బెల్టు షాపు నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని స్టేషన్ లో ఫిర్యాదు చేస్తున్న మహిళలు

'పురపాలిక' భారం..!

- వసూలుకాని నిర్వహణ ఛార్జీలు
- గ్రామీణ తాగునీటి నిర్వహణకు తప్పని ఇక్కట్లు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

గ్రామీణ తాగునీటి నిర్వహణపై బకాయిల భారం పడుతోంది. అనంతపురం జిల్లాలో బహుళార్ధక రక్షిత తాగునీటి పథకం కింద 26 స్కీమ్‌లు నడుస్తున్నాయి. వీటి నిర్వహణకు ఏడాదికి రూ.51.21 కోట్లు కాగా, విద్యుత్ ఛార్జీలు మరో రూ.62.37 కోట్లు ఉండనున్నాయి. ఈ నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా బడ్జెట్ కేటాయింపులేవీ ఉండటం లేదు. స్థానిక సంస్థలకు ఫైనాన్స్ నిధుల నుంచి వినియోగిస్తున్నారు. ఇందులోనూ బహుళార్ధక తాగునీటి పథకాలకు అత్యధికంగా జిల్లా పరిషత్‌కు వచ్చే నిధులే వాటికి వినియోగిస్తున్నారు. నిర్వహణ, విద్యుత్ ఛార్జీలు డబ్బులు కూడా సకాలంలో ప్రభుత్వాల నుండి రాకపోవడంతో కార్మికులకు వేతనాలు కూడా సక్రమంగా చెల్లించలేని పరిస్థితులు నెలకొన్నాయి. ఇటువంటి తరుణంలో కొన్ని మున్సిపాలిటీలు కూడా తమ వాటాగా ఇవ్వాల్సిన నిర్వహణ ఛార్జీలను జిల్లా గ్రామీణ తాగునీటి సంస్థకు చెల్లించడం లేదు. ఫలితంగా బకాయిలు పేరుకుపోయి నిర్వహణకు నిధుల్లేక అవస్థలు పడే పరిస్థితులు నెలకొన్నాయి.

ఉమ్మడి అనంతపురం జిల్లాలో తాడిపత్రి, గుత్తి, కళ్యాణదుర్గం, మడకశిర, హిందూపురం పురపాలక సంఘాలకు ప్రత్యేకమైన తాగునీటి వ్యవస్థ లేదు. ఇవి గ్రామీణ తాగునీటి వ్యవస్థ నుంచే కలిపి ఇస్తున్నారు. ఇందుకు పురపాలక సంఘాలు ఏటా నిర్వహణ ఛార్జీలను జిల్లా గ్రామీణ తాగునీటి సంస్థకు చెల్లించాల్సి ఉంటుంది. ఇవి అనేక నెలలుగా చెల్లించకపోవడంతో బకాయిలుగా ఉండిపోతున్నాయి. ఈ నిధులు సకాలంలో చెల్లిస్తే బహుళ తాగునీటి పథకాల నిర్వహణకు కొంత వెసలుబాటు లభించే అవకాశముంటుంది.

రూ.263.32 కోట్ల వరకు బకాయిలు

ఉమ్మడి అనంతపురం జిల్లాలో తాడిపత్రి పురపాలక సంఘం బకాయి రూ.31.54 కోట్లు ఉంది. గుత్తి పురపాలక సంఘంకు సంబంధించి రూ.4.47 కోట్లు, కళ్యాణదుర్గం పురపాలక సంఘం రూ.15.73 కోట్లు, మడకశిర రూ.2.37 కోట్లు, హిందూపురం పురపాలక సంఘం రూ.39.18 కోట్లు బకాయిలున్నాయి. మొత్తంగా ఐదు పురపాలక సంఘాల నుంచి కలిపి రూ.93.32 కోట్లు బకాయిలు పేరుకుపోయి ఉన్నాయి. ఇవి కాకుండా జిల్లా పరిషత్ నుంచి కూడా రూ.170 కోట్ల బకాయిలున్నాయి. మొత్తం కలిపి రూ.263.32 కోట్లు బకాయిలున్నాయి. ఇవి చెల్లించాలని గ్రామీణ తాగునీటి సంస్థ అధికారులు ఆయా పురపాలక సంఘాలకు విజ్ఞాపనలు పంపుతున్నా స్పందన ఉండటం లేదు. ఇవి వస్తే నిర్వహణకు కొంత వరకు ఆర్థికపరమైన ఇబ్బందులు తొలిగే అవకాశమున్నట్టు అధికారులు చెబుతున్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా కోశాధికారి సాంబశివ

దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి : సిఐటియు

ప్రజాశక్తి-పెనుకొండ

కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ జులై 9వ తేదీ జరిగే దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా కోశాధికారి బి.సాంబశివ పిలుపునిచ్చారు. పట్టణంలోని రోడ్లు భవనాల శాఖ అతిథి గృహంలో గురువారం సిఐటియు మండల కన్వీనర్ బాబావలి అధ్యక్షతన పట్టణ కమిటీ సమావేశం నిర్వహించారు. సాంబశివ మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను సవరించి 4 లేబర్ కోడ్స్ బిల్లులు తీసుకొచ్చి కార్మికుల హక్కులను హరించిందన్నారు. కార్మికుల శ్రమను పెట్టుబడిదారులకు దోచిపెట్టడానికే కార్మిక చట్టాలను సవరించిం దన్నారు. ఈ లేబర్ కోడ్స్ అమలైతే కార్మికులకు సంఘం పెట్టుకునే హక్కు లేకుండా పోతుందన్నారు. ఓ వైపు దేశంలో నిరుద్యోగం, పేదరికం పెరిగి ప్రజల కొనుగోలు శక్తి పడిపోయింద న్నారు. మోడీ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకపోగా కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న చట్టాలను పెట్టుబడిదారుల ప్రయోజనం కోసం సవరించడం దారుణమన్నారు. ఈ తరుణంలో దేశవ్యాప్త సమ్మెలో అన్ని రంగాల ఉద్యోగులు, కార్మికులు, ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు హరి, సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు నాగరాజు, అంగన్వాడీ యూనియన్ నాయకురాలు బావమ్మ, రాజేశ్వరి, వెంకటేష్, తోపుడు బండ్ల సంఘం నాయకులు ఆరిఫ్, కార్పెంటర్ సంఘం నాయకులు నరసింహులు, తదితరులు పాల్గొన్నారు.

సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ చేతన్

ఇసుక అక్రమ రవాణా చేస్తే చర్యలు

కలెక్టర్ టిఎస్.చేతన్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

ఉచిత ఇసుకను అక్రమంగా రవాణా చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ టిఎస్.చేతన్ హెచ్చరించారు. గురువారం స్థానిక కలెక్టరేట్లో కలెక్టర్ అధ్యక్షతన జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, ఎస్పీ వి.రత్న, జిల్లా భూగర్భ శాఖ అధికారి పెద్దిరెడ్డి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఉచిత ఇసుక పాలసీని పటిష్టంగా అమలు చేయాలన్నారు. జిల్లా ఉచిత ఇసుక విధానాన్ని పారదర్శకంగా అమలు చేయాలన్నారు. ఇసుక రవాణా చేసే అన్ని వాహనాలకు ఉచిత ఇసుక రవాణా వాహనం అనే బ్యానర్‌ను కట్టాలని తెలియజేశారు. వాహనాలకు జిపిఎస్‌ను అమర్చాలన్నారు. ఇసుక సరఫరా కేంద్రాల వద్ద సీసీ కెమెరాలు తప్పనిసరిగా ఉండాలన్నారు. అంతర్ రాష్ట్ర మార్గాలలో పోలీసులు ఏర్పాటు చేసిన చెక్‌పోస్టులలో అక్రమ ఇసుక రవాణా జరగకుండా రాత్రి సమయాల్లో గట్టి పర్యవేక్షణ ఉండాలని ఆదేశించారు. ఉచిత ఇసుక విధానాన్ని ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఇసుక ఎక్కడ అక్రమ రవాణా జరగకుండా సంబంధిత అధికారులందరూ సమన్వయంతో పనిచేసి అరికట్టాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా స్థాయి ఇసుక కమిటీ సభ్యులతో పాటు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

బదిలీ తేదీపై స్పష్టత ఇవ్వండి : యుటిఎఫ్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

తెలుగు, హిందీ పాఠశాల సహాయకుల రిలీవింగ్, జాయినింగ్ తేదీలపై స్పష్టత ఇవ్వాలని యుటిఎఫ్ నాయకులు కోరారు. ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్(యుటిఎఫ్) శ్రీ సత్య సాయి జిల్లా శాఖ ఆధ్వర్యంలో గురువారం ఉదయం అనంతపురం విద్యాశాఖధికారి ఎం.ప్రసాద్ బాబుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శెట్టిపి జయ చంద్రారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.సుధాకర్, అనంతపురం జిల్లా అధ్యక్షులు గోవింద రాజులు, ప్రధాన కార్యదర్శి లింగమయ్య, రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యులు రమణయ్య మాట్లాడుతూ తెలుగు, హిందీ పాఠశాల సహాయకుల రిలీవింగ్, జాయినింగ్ విషయంపై స్పష్టత ఇవ్వాలన్నారు. ఎంటిఎస్ ఉపాధ్యాయులకు స్థానిక మండలాల్లోనే పోస్టింగ్‌లు ఇవ్వాలని కోరారు. 2025 లో జరిగిన బదిలీలలో భాగంగా జిల్లా విద్యాశాఖ అధికారులు 8/06/25న విడుదల చేసిన ఉత్తర్వులు ప్రకారం తెలుగు, హిందీకి సంబంధించిన ఉపాధ్యయులు 08/06/2025 రిలీవ్ అయ్యి, 09/06/2025 నూతన పాఠశాలల్లో జాయిన్ కావాలని చెప్పారన్నారు. పాఠశాల సహాయకులు తెలుగు, హిందీకి సంబంధించి తదుపరి ఉత్తర్వులు వచ్చేంతవరకు రిలీవ్ కాకూడదని 08/06/2025 న సాయంత్రం ఉత్తర్వులు ఇచ్చారన్నారు. ఈ ఉత్తర్వులు అనుసరించి భాష పాఠశాల సహాయకులు ఆరోజు బదిలీ పొందిన పాఠశాలలో చేరకుండా పూర్వపు పాఠశాలలోనే డిప్యూటేషన్ కింద హాజరు అయ్యారన్నారు. 15/06/25న విడుదల చేసిన ఉత్తర్వుల్లో 14వ తేదీ రిలీవింగ్ 15న జాయినింగ్ అని కొంతమంది, 15న రిలీవింగ్ 16న జాయినింగ్ అని కొంతమంది ఉపాధ్యాయులు ఉన్న నేపథ్యంలో ప్రధానోపాధ్యాయుల్లో సందిగ్ధత ఉందన్నారు. దీనిపై విద్యాశాఖ అధికారులు స్పందించి ఈ ఉపాధ్యాయులకు స్పష్టమైన తేదీని జిల్లావ్యాప్తంగా ప్రధాన ఉపాధ్యాయులకు తెలియజేయాలని సూచించారు. బదిలీ పొందిన వారికి క్యాడర్ స్ట్రెంగ్త్ ఇస్తూ సకాలంలో జీతాలు అందించాలని విజ్ఞప్తి చేశారు. ఎంటిఎస్ ఉపాధ్యాయులకు స్థానిక మండలాల్లోనే పోస్టింగ్‌లు ఇవ్వాలని కోరారు. దీనిపై డిఇఒ స్పందిస్తూ వీటిపై రెండు రోజుల్లో స్పష్టమైన ఆదేశాలు ఇస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు రామకృష్ణ నాయక్, నారాయణ స్వామి, సుబ్బారాయుడు పాల్గొన్నారు.

డిఇఒకు వినతిపత్రం అందజేస్తున్న యుటిఎఫ్ నాయకులు

ఆర్డీటీని పరిరక్షించుకునేంత వరకు పోరాటం : వైసిపి

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం టౌన్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మెడలు వంచి ఆర్‌డిటి(రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్)ని కాపాడుకుందా మని వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి, మాజీ ఎంపీ తలారి రంగయ్య పిలుపునిచ్చారు. మతం ముసుగు అంట గట్టి స్వచ్ఛంధ సంస్థను మూసేస్తామంటే చూస్తూ ఊరుకోమని ఘాటుగా హెచ్చరించారు. ఆర్‌డిటి విదేశీ నిధులకు సంబంధించి ఎఫ్‌సిఆర్ఎ(ఫారిన్ కాంట్రిబ్యూషన్ రెగ్యులేషన్ యాక్ట్)ను రెన్యూవల్ చేయాలని డిమాండ్ చేస్తూ ఆ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త తలారి రంగయ్య ఆధ్వర్యంలో చేపట్టిన పాదయాత్ర 16వ రోజైన గురువారం ముగిసింది. దీంతో పట్టణంలోని జగ్జీవన్‌రామ్ విగ్రహం సర్కిల్ బహిరంగ సభ నిర్వహించారు. అనంత మాట్లాడుతూ ఆర్‌డిటికి ఎదురైన ఆటంకాలపై ఉమ్మడి జిల్లాలోని కూటమి ఎమ్మెల్యేలు, ఎంపీలు ఏమాత్రం శ్రద్ధ చూపడం లేద న్నారు. ఇంతటితో పోరాటం ఆగదని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మెడలు వంచి ఆర్‌డిటికి ఎఫ్‌సిఆర్ఎను రెన్యువల్ చేయిస్తామని తెలిపారు. ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ వర్ధంతి రోజున ఆయన విగ్రహానికి పూల మాలలు వేయకుండా అడ్డుకున్న దుర్మార్గపు పాలన సాగుతుందని మండిపడ్డారు. రంగయ్య మాట్లాడుతూ ఆర్‌డిటి లేకపోతే పేదల బతుకులకు మెతుకులు కూడా దొరకవని ఆవేదన వ్యక్తం చేశారు. పాదయాత్రకు పోలీసులతో ఆటంకాలు కల్పించడం దురదృష్టకరమన్నారు. ఇది రాజకీయ పాదయాత్ర కాదని పేదల కోసం చేసిన యాత్ర అన్నారు. పార్టీ అధినేత జగన్‌తో చర్చించాక భవిష్యత్తు కార్యాచరణ కూడా ఉంటుందని స్పష్టం చేశారు. పార్లమెంట్ పరిశీలకులు నరేష్‌రెడ్డి, మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్, సీనియర్ నాయకులు ఉమామహేశ్వర్ నాయుడు, రాష్ట్ర కార్యదర్శి తిప్పేస్వామి ఆర్‌డిటిని కాపాడటంలో పాలక ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ మంగమ్మ, జడ్పీ ఛైర్‌పర్సన్ గిరిజమ్మ, మహాలక్ష్మి శ్రీనివాస్, కోగటం విజయబాస్కర్‌రెడ్డి, రఘునాథ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ సభలో మాట్లాడుతున్న మాజీ ఎంపీ రంగయ్య, చిత్రంలో వైసిపి జిల్లా అధ్యక్షుడు అనంత

ఆన్‌లైన్‌లో అదనపు భూమిని తొలగించండి

'తల్లికి వందనం' వర్తించని తల్లిదండ్రుల మొర

ప్రజాశక్తి-రొద్దం

తమకు వాస్తవంగా ఉన్న వ్యవసాయ భూమి కంటే ఆన్‌లైన్‌లో ఎక్కువగా చూపడంతో తల్లికి వందనం పథకం వర్తించలేదని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆన్‌లైన్‌లో అదనంగా చూపిస్తున్న భూమిని వెంటనే తొలగించాలని కోరుతూ మండలంలోని నల్లూరు గ్రామానికి చెందిన పలువురు రైతులు గురువారం డిప్యూటీ తహశీల్దార్ చంద్రశేఖర్‌కు వినతి పత్రాలు ఇచ్చారు. వారు మాట్లాడుతూ నల్లూరు గ్రామ పొలంలోని సర్వే నంబర్ 480లో 44-41ఎకరాల భూమిని దాదాపు 30 మంది రైతులకు వారి తాతల కాలంలో మాన్యం భూములుగా ఇచ్చారు. అయితే ఆ భూమి కంటే 6 ఎకరాలు అదనంగా ఉందని 1-బిలు రావడం లేదని, దీంతో ప్రభుత్వం అందిస్తున్న తల్లికి వందనం ఈ 30 మంది రైతుల కుటుంబాల్లోని సుమారు 40 నుంచి 50 మందికి విద్యార్థులకు వర్తించలేదు. అలాగే అన్నదాత సుఖీభవ, పలు సంక్షేమ పథకాలు అందడం లేదన్నారు. అదనంగా ఉన్న 6-34 ఎకరాల భూమి ఆరుగురి పేర్లపై ఉందని, వారిని తొలగిస్తే మిగతా భూములు అందరికీ రికార్డు పరంగా ఉంటుందన్నారు. డిప్యూటీ తహశీల్దార్ మాట్లాడుతూ సంబంధిత సచివాలయంలో జాయింట్ ఎల్‌పిఎం సబ్ డివిజన్ కోసం చలానా కట్టి సబ్ డివిజన్ చేసుకుంటే 'తల్లికి వందనం' పథకానికి సమస్య ఉండదని సూచించారు. దీంతో వారు చిన్నమంతూరు సచివాలయం వెళ్లి సుమారు 30 మంది ఒకే సర్వే నంబర్‌లో ఉన్నందున పది మందికి ఒక ఎల్‌పిఎం సబ్ డివిజన్ ద్వారా 3 సబ్ డివిజన్లు చేయాలని కోరారు. ఈ విషయమై సర్వే చేపడతామని అధికారులు రైతులకు తెలిపారు.

డిప్యూటీ తహశీల్దార్ చంద్రశేఖర్‌కు వినతి పత్రం ఇస్తున్న రైతులు

ప్రమాదకరంగా వ్యవసాయ పరికరాల తరలింపు

ప్రజాశక్తి-రొద్దం

ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో మండలంలో పలువురు రైతులు ట్రాక్టర్లు, వ్యవసాయ పరికరాలు కొనుగోలు చేస్తున్నారు. ఈ క్రమంలోనే విత్తనం వేసేందుకు విత్తన గొర్రు అవసరం కావడంతో అనంతపురంలోని ఓ ప్రయివేటు కంపెనీ ప్రతినిధులకు నగదు చెల్లిస్తే వారే వాహనంలో గ్రామాలకు డెలివరీ చేస్తున్నట్లు తెలుస్తోంది. అయితే ఆ కంపెనీ ప్రతినిధులు బాగా వెడల్పు ఉన్న విత్తన గొర్రు చిన్న వాహనంలో అనంతపురం నుంచి రొద్దం మండలంలోని వివిధ గ్రామాలకు దాదాపు 100 కిలోమీటర్లు ప్రధాన రోడ్డుపై తరలిస్తున్నారు. కనీసం ఆ వాహనానికి వెనుక వైపు ఎలాంటి హెచ్చరిక సంకేతాలు లేకుండా తరలిస్తున్నారు. దీంతో ఎప్పుడైనా ప్రమాదం జరిగే అవకాశాలు లేకపోలేదు. కావున అలాంటి పరికరాలను పెద్ద వాహనాల్లో తరలించేలా చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ప్రమాదకర రీతిలో తరలిస్తున్న విత్తనగొర్రు

విద్యామిత్ర కిట్లు పంపిణీ

ప్రజాశక్తి-రొద్దం

మండలంలోని బూచెర్ల గ్రామ ప్రాథమికోన్నత పాఠశాలలో గురువారం సర్వేపల్లి రాధాకృష్ణ విద్యామిత్ర కిట్ల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ముఖ్య అతిథిగా రాష్ట్ర ఐటిడిపి అధికార ప్రతినిధి రెడ్డివారి మంజునాథ్, నారాయణ హాజరై విద్యార్థులకు విద్యామిత్ర కిట్లు పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ కేవలం విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో విద్యా వ్యవస్థలో తెచ్చిన మార్పులను వివరించారు. పాఠశాలకు తమ వంతు సాయం చేస్తామని తెలిపారు. 'మన ఊరు-మన బాధ్యత' అనే సామాజిక సిద్ధాంతంతో గ్రామంలో అందరూ విద్యాభివృద్ధికి కృషి చేయాలని కోరారు. అనంతరం సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత చిత్రపటలకు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో మంజు, నారాయణ, డీలర్ చంద్రమౌళి, కదిరన్న, నరసింహులు, ఉపాధ్యాయులు, నాయకులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సర్వేపల్లి రాధాకృష్ణ విద్యామిత్ర కిట్లు అందుకున్న విద్యార్థులు

ప్రజాశక్తి
www.prajasakti.com

22న ఆక్రమణల తొలగింపు

ప్రజాశక్తి - కొత్తచెరువు

కొత్త చెరువులోని నాలుగు రోడ్లకు ఇరువైపులా ఉన్న ఆక్రమణలను ఈనెల 22న తొలగించడానికి చర్యలు తీసుకున్నట్లు ఆర్అండ్‌బి జెఇ వన్నూరు స్వామి తెలిపారు. అంత లోపల మార్కింగ్ వేసిన ప్రకారం ఆక్రమణలను స్వచ్ఛందంగా తొలగించుకోవాలని లేని పక్షంలో. ఆరోజు పోలీస్ బందోబస్తుతో జెసిపి లతో వాటిని తొలగించడం జరుగుతుందని చెప్పారు. దాదాపు 120 మందికి నోటీసులు ఇచ్చామని ఇందులో నలుగురు తప్ప మిగిలిన వారు ఎవరు స్పందించలేదని అన్నారు. కావున వాటిని తొలగిస్తామన్నారు.

దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేద్దాం

ప్రజాశక్తి - కదిరి టౌన్

కార్మిక కర్షక ప్రజల ప్రయోజనాలకు విరుద్ధంగా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం పాలన సాగుతుందని కేంద్ర ప్రభుత్వం విధానాలకు వ్యతిరేకంగా కార్మిక సంఘాల పిలుపు మేరకు జులై 9న జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేద్దామనిరైతు సంఘం జిల్లా కార్యదర్శి జంగాల పల్లి పెద్దన్న పిలుపు ఇచ్చారు. గురువారం కదిరి పట్టణంలోని రైతు సంఘం కార్యాలయంలో రైతు సంఘం నాయకులు శంకర్ రెడ్డి అధ్యక్షతన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిలుగా రైతు సంఘం జిల్లా కార్యదర్శి జంగాలపల్లి పెద్దన్న,ఉపాధ్యక్షులు శివన్న హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా విధానాలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని, హంద్రీనీవా కాలువను 10వేల క్యూసెక్కుల సామర్థ్యంతో వెడల్పు చేసి జిల్లాలో ఉన్న అన్ని చెరువులకు నీరు నింపి ఆయకట్టు ఏర్పాటు చేసి పంటలకు సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. అనంతరం కదిరి మండల రైతు సంఘం కమిటీని 15 మందితో ఎన్నుకోన్నారు. రైతు సంఘం అధ్యక్షులుగా శంకర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా సుధాకర్ రెడ్డి, ఉపాధ్యక్షులుగా ఆదినారాయణ రెడ్డి, రామసినాయక్, సహాయ కార్యదర్శులుగా ఎం రెడ్డప్ప, ఏం రామ్మోహన, కోశాధికారిగా శివారెడ్డితో పాటు ఎనిమిది మంది కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి - కొత్తచెరువు

మండల పరిధిలోని బైరాపురం గ్రామ సమీపంలో రైలుకింద పడి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు తెలిపిన మేరకు వివరాలు.. అనంతపురానికి చెందిన జగదీష్ రెడ్డి సత్యసాయి జిల్లా కొత్తచెరువు మండలం బైరాపురానికి చెందిన అంజలి అనే యువతిని ప్రేమ వివాహం చేసుకున్నాడు. వీరికి ఒక కుమారుడు ఉన్నాడు. జగదీష్‌రెడ్డి గత రెండు నెలలుగా బైరాపురం నుంచి కియా పరిశ్రమకు వెళ్లి అక్కడ విధులు నిర్వహించేవాడు. ఈ నేపథ్యంలో గురువారం జగదీష్‌రెడ్డి రైలు కింద తలపెట్టి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి ముఖాన్ని గుర్తుపట్టలేని స్థితిగా తల రెండు ముక్కలైంది. జగదీష్‌రెడ్డి మృతికి గల కారణాలు పోలీసుల విచారణలో తెలియాల్సుంది.

రోడ్డు ప్రమాదంలో బ్యాంకు ఉద్యోగి మృతి

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం రూరల్

శెట్టూరు మండలంలోని ములకలేడు గ్రామ యూనియన్ బ్యాంకులో క్యాషియర్‌గా పని చేస్తున్న పార్థసారథి(51) గురువారం రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. పార్థసారథి ఉదయం అనంతపురం నుంచి కళ్యాణదుర్గంకు వచ్చి అక్కడి నుంచి ద్విచక్ర వాహనంపై ములకలేడు వెళ్తుండగా గొల్లపల్లి గ్రామ సమీపంలో ఎదురుగా వస్తున్న మరో బైక్‌ను ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో పార్థసారథి మృతి చెందగా మరో ముగ్గరికి గాయాలయ్యారు. విషయం తెలిసిన వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టినట్లు తెలిపారు.

ఆర్‌డిటి ఎఫ్‌సిఆర్ఎను పునరుద్ధరించాలి

కలెక్టర్ వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

బుక్కపట్నం మండలంలో తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - పుట్టపర్తి క్రైమ్

ఆర్‌డిటికి ఎఫ్‌సిఆర్ఎను వెంటనే పునరుద్ధించాలని జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం కోశాధికారి ఎస్ వెంకటేష్, బ్రాహ్మణపల్లి తండా గ్రామస్తులు డిమాండ్ చేశారు. గురువారం కలెక్టర్ టి. ఎస్ చేతన్ కు, జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్‌కు వేరువేరుగా వినతి పత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్సి, ఎస్టి బడుగు వర్గాల ప్రజల కోసం జిల్లాలో ఆర్ డి టి ఎన్నో సేవలు అందిస్తోందన్నారు. కేంద్ర ప్రభుత్వం ఎఫ్ సి ఆర్ ఏ పునరుద్ధించక పోవడంతో గత మూడు నెలలుగా నిధులు నిలిచిపోయాయన్నారు. పేదలకు అందిస్తున్న సేవలను గుర్తించి ఆ సంస్థకు వెంటనే ఎఫ్‌సిఆర్ఎను పునరుదించాలని లేనిపక్షంలో అన్ని ప్రజా సంఘాలతో కలసి కలెక్టరేట్ వద్ద ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు రామాంజనేయులు, చిన్న వీరన్న, ప్రభాకర్, చిన్న నాగప్ప, బ్రాహ్మణపల్లి తండా నాయకులు రమణ నాయక్, విజయ్ కుమార్ నాయక్, గణేనాయక్, చిన్న స్వామి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

బత్తలపల్లి : ఆర్డీటీకి కేంద్ర ప్రభుత్వం వెంటనే ఎఫ్‌సిఆర్ఎను రెన్యువల్ చేయాలని ప్రజా సంఘాల నాయకులు కోరారు. ఈ మేరకు వారు గురువారం మండలకేంద్రంలో ర్యాలీ నిర్వహించి, తహశీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఆర్డీటీ వ్యవస్థాపకులు ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ వర్ధంతిని పురస్కరించుకుని ప్రజా సంఘాల నాయకులు, ప్రజలు పెద్ద ఎత్తున బత్తలపల్లిలోని ఫెర్రర్ ఘాట్ వద్దకు తరలివచ్చి ఘాట్ వద్ద నివాళులర్పించారు. అనంతరం 'ఆర్డీటిని కాపాడుకుందాం ఆర్డీటిని రక్షించుకుందాం' అనే కార్యక్రమంలో భాగంగా మండలంలోని 40 గ్రామాలకు చెందిన ప్రజలతో కలిసి ప్రజా సంఘాల నాయకులు ఘాట్ వద్ద నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్ రామాంజినమ్మకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా రైతు సంఘం అధ్యక్షులు కమతం కాటమయ్య, ఎస్సీ జనసంఘం నాయకులు రాంప్రసాద్, కుళ్లాయప్ప, దళిత హక్కుల పోరాటసమితి జిల్లా అధ్యక్షులు కాడుకృష్ణ, బహుజన్ సమాజ్ పార్టీ ధర్మవరం నియోజకవర్గ ఇన్‌చార్జి వినయ్ కుమార్, సీపీటీలు వీరనారప్ప ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

ఫాదర్ ఫెర్రర్ వర్ధంతి : ఆర్డీటీ వ్యవస్థాపకులు ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ 18వ వర్ధంతి సందర్భంగా సంస్థ డైరెక్టర్లు, సిబ్బంది ఘనంగా నివాళులర్పించారు. మండల కేంద్రమైన బత్తలపల్లి గురువారం ఫాదర్ ఘాట్‌ను పుష్పాలతో అలంకరించారు. సంస్థలో పని చేస్తున్న వివిధ విభాగాలకు చెందిన సిబ్బంది ఉదయం నుంచి సాయంత్రం వరకు ఘాట్ వద్ద నివాళులర్పించారు. అదేవిధంగా మండలంలోని పలు గ్రామాలలో ఫాదర్ ఫెర్రర్ వర్ధంతి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. సంజీవపురం, సూర్యచంద్రాపురం, డి.చెర్లోపల్లి గ్రామాల్లోని ఫాదర్ ఫెర్రర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అన్నేఫెర్రర్ బత్తలపల్లిలోని ఫాదర్ ఫెర్రర్ మాట్ వద్ద నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీటీ రీజనల్ డైరెక్టర్ ప్రమీల, మెడికల్ డైరెక్టర్ ప్రవీణ్ కుమార్, హనుమంతరెడ్డి, సీవీటీ కాటమయ్యతో పాటు ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కొత్తచెరువు, : ఆర్డీటీ వ్యవస్థాపకులు ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ నిస్వార్థ సేవకుడుగా మన్ననలు పొందారని ఏరియా టీమ్ లీడర్ సంజీవరెడ్డి అన్నారు.ఆర్డీటీ ఎఫ్‌సిఆర్ఎను పునరుద్ధరించాలని కోరారు. ఈసందర్భంగా ర్యాలీగా వెళ్లి స్థానిక తహశీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు.

బుక్కపట్నం : ఆర్డీటీకి చెందిన ఎఫ్‌సిఆర్ఎను వెంటనే రెన్యువల్ చేసి సంస్థను కాపాడాలని మహిళలు కోరారు. గురువారం బుచ్చయ్యగారిపల్లి, జానకంపల్లి గ్రామానికి చెందిన మహిళలు పెద్ద ఎత్తున శాంతియుత ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కరువు ప్రాంత ప్రజలకు ఆర్డీటీ ఎంతో అండగా ఉంటోందన్నారు. అలాంటి సంస్థ ఎఫ్‌సిఆర్‌ను కేంద్ర ప్రభుత్వం ఆపివేయడం తగదని తెలిపారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వంతో చర్చలు జరిపి ఆర్డీటీ ఎఫ్‌సిఆర్ఎను పునరుద్ధరించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం రెవెన్యూ అధికారులకు వినతిపత్రం సమర్పించారు.ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో మహిళలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ధర్మవరం రూరల్ : ధర్మవరం నియోజకవర్గంలోని బత్తలపల్లి లో గల ఆర్ డి టి సేవా కార్యక్రమాలను పునరుద్ధించేలా చర్యలు చేపట్టాలని పట్టణంలోని శ్రీ సాయి రూరల్ విభిన్న ప్రతిభావంతుల మండల సమైక్య కమిటీ నాయకులు కోరారు. ఈ మేరకు వారు గురువారం ఆర్డీవో మహేష్ కు, తహశీల్దార్ సురేష్ కుమార్ కు వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాలకు, వికలాంగుల అభివృద్ధికి ఆర్డీటీ ఎంతో కృషి చేస్తోందన్నారు. ఇలాంటి తరుణంలో కేంద్ర ప్రభుత్వం ఎఫ్‌సిఆర్ఎ నిధులను నిలుపుదల చేయడం దారుణమన్నారు. వలన రాబోయే కాలంలో అందరూ ఎన్నో ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల సమైక్య నాయకులు ఈశ్వరమ్మ, ఈశ్వర్ రెడ్డి, ఈశ్వరయ్య, నల్లప్ప, చంద్రయుడు, విష్ణుమూర్తి, చంద్రశేఖర్, రేణుకమ్మ, కాంతమ్మ, ప్రభాకర్ తదితర నాయకులు పాల్గొన్నారు.

కొత్తచెరువు : రాయలసీమ ప్రాంతంలో పేద ప్రజలకు ఎన్నో సేవలు అందిస్తున్న ఆర్డీటీ సంస్థకు కేంద్ర ప్రభుత్వం ఎఫ్‌సిఆర్ఎను పునరుద్ధరించాలని మండలంలోని ఆర్డీటీలో పనిచేస్తున్న మహిళలు కోరారు. ఈ మేరకు వారు గురువారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేద ప్రజలను ఆర్డీటీ ఎంతో ఆదుకుంటోందన్నారు. ఫాదర్ ఫెర్రర్ వర్ధంతి సందర్భంగా సంస్థ ఎఫ్‌సిఆర్ఎను పునరుద్ధరించాలని వారు కోరారు. అనంతరం ఆర్ఐ కిరణ్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పెద్దక్క, అలివేలమ్మ, నాగమ్మ, లక్ష్మీదేవి,తదితరులు పాల్గొన్నారు.

నల్లమాడ : ఫాదర్ విన్సెంట్ ఫెర్ర్ వర్ధంతిని మండలకేంద్రంలో గురువారం జరుపుకున్నారు. ఫాదర్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించడం జరిగినది ఈ కార్యక్రమంలో ఎటిఎల్ వన్నూరు స్వామి, శ్రీనివాసులు, బి రామచంద్ర తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా టిడిపి మండల నాయకుల ఆధ్వర్యంలో ఫాదర్ ఫెర్రర్ వర్ధంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు డాక్టర్ బుట్టి నాగభూషణం నాయుడు, శివప్రసాద్ రెడ్డి, మహేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తాడిమర్రి : ఫాదర్ ఫెర్రర్ 16వ వర్ధంతి సందర్భంగా గురువారం తాడిమర్రిలో ర్యాలీ నిర్వహించారు, సేవ్ ఆర్ డి టి అంటూ వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. తహశీల్దార్ భాస్కర్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రామకృష్ణ, ఆర్ డి టి మహిళా సంఘాలు కమిటీ సభ్యులు గ్రామస్తులు పాల్గొన్నారు.

అనుమతుల్లేని ప్రయివేటు పాఠశాల సీజ్

ప్రజాశక్తి - బత్తలపల్లి

ప్రభుత్వ అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న ప్రయివేటు పాఠశాలను డీఈవో ఆదేశాల మేరకు సీజ్ చేసినట్లు. ఎంఇఒలు చాముండేశ్వరి, సుధాకర్‌నాయక్ తెలిపారు. బత్తలపల్లిలో నిర్వహిస్తున్న ఫోనిక్స్ ఇంగ్లీష్ మీడియం ప్రవేట్ పాఠశాలను తనిఖీలు చేసి అనుమతి పత్రాలు లేనందున సీజ్ చేసినట్లు తెలిపారు. అయితే ఇదంతా బత్తలపల్లిలోని ప్రయివేటు పాఠశాలల యజమాన్యాల ఒత్తిడి మేరకు జరుగుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. పాఠశాలను సీజ్ చేసిన తర్వాత సీజ్ చేసినట్లు ప్రయివేటు పాఠశాలల గ్రూపులో సమాచారం ఇచ్చారు. వాటి ద్వారా పాత్రికేయులకు సమాచారం అందించడంతో ఈ ఆరోపణలకు బలం చేకూరుతోంది.

పైపులైను ఏర్పాటు

ప్రజాశక్తి-హిందూపురం

గొల్లపల్లి తాగునీటి పథకానికి సంబంధించి నీటిని నిలువ చేసే ప్రాంతం నుండి కొల్లకుంటకు నూతన పైప్ లైన్ ఏర్పాటు చేస్తున్నారు. కొల్లకుంట నీరు నిలువ చేసే ప్రాంతం అయినప్పటికీ ఇక్కడ పైప్ లైన్ లేకపోవడంతో ఎదుర్కొంటున్న ఇబ్బందులను పలుమార్లు స్థానికులు ఇటు మున్సిపల్ చైర్మన్‌కు అటు అధికారులకు విన్నవిచారు. స్పందించిన మున్సిపల్ చైర్మన్ కొల్లకుంట ప్రాంతానికి నూతనంగా పైపు లైన్ ఏర్పాటు చేస్తామని అప్పట్లో హామీ ఇచ్చారు. ఈ మేరకు కరువు నిధులతో నీటి ఎద్దడి నివారణ కోసం కొత్త పైప్ లైన్ వేయడానికి చర్యలు చేపట్టారు. గురువారం ఇందుకు సంబంధించిన పనులను అధికారులు కలిసి మున్సిపల్ చైర్మన్ డిఈ రమేష్ కుమార్ పరిశీలించారు. నాణ్యత ప్రమాణాలు పాటించి త్వరితగతిన పనులను పూర్తి చేయాలని కాంట్రాక్టర్లకు సూచించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ మల్లికార్జున గౌడ్, ఏఈ జనార్ధన్, టీడీపీ పట్టణ అధ్యక్షులు ప్రెస్ వెంకటేష్, టీడీపీ లీగల్ సెల్ నాయకులు శివశంకర్, టీడీపీ నాయకులు దుర్గా నవీన్ తదితరులు పాల్గొన్నారు.

పైపులైను పనులు పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్

ప్రభుత్వ ఆసుపత్రికి సామాజిక సహకారం

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

ధర్మవరం ప్రభుత్వ ఆసుపత్రిలోని కంటి విభాగానికి అవసరమైన సామాగ్రిని స్పందన ఆసుపత్రి వ్యవస్థాపకులు డాక్టర్ బషీర్, డాక్టర్ సోనియా గురువారం అందజేశారు. సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా సుమారు 40 వేల రూపాయలు విలువచేసి విజన్ చార్టర్, ట్రయల్ ఆప్టికల్ బాక్స్, డైరెక్ట్ ఆప్తాల్మిక్ స్కోప్, కలర్ విజన్ చార్ట్, నియర్ విజన్ చార్ట్ తదితర కంటి సామాగ్రిని ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ మాధవికి అందజేశారు. ఈ కార్యక్రమంలో అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ ఉదయభాస్కర్, ప్రభుత్వ వైద్యులు నజీర్, రాముడు,హరి శ్రీనివాస్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ రిజర్వ్ స్థలాలను స్వాధీనం చేసుకోవాలి

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

వైసిపి ప్రభుత్వ హయాంలో కబ్జాకు గురైన మున్సిపల్ రిజర్వ్ స్థలాలను, రెవెన్యూ రిజర్వు స్థలాలను స్వాధీనం చేసుకోవాలని టిడిపి పట్టణ నాయకులు కోరారు. ఈ మేరకు వారు గురువారం మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్‌ను కలసి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. వైసిపి ప్రభుత్వం హయాంలో కబ్జాలకు గురైన స్థలాలను వాటి సర్వే నెంబర్లతో సహా లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. వాటిపై విచారణ జరిపి తక్షణమే సంబంధిత మున్సిపల్ రిజర్వ్ స్థలాన్ని స్వాధీనపరుచుకోవాలని కోరారు. గతంలో వీటిని అధికారుల దృష్టికి తీసుకువచ్చామని గుర్తుచేశారు. స్పందించిన కమిషనర్ వెంటనే సంబంధిత అధికారులను పిలిపించి తక్షణమే విచారణ జరిపి మున్సిపల్ రిజర్వ్ స్థలాన్ని స్వాధీనపరుచుకోవాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

తల్లికివందనంపై హర్షం

సంబరాలు చేసుకుంటున్న విద్యార్థినులు, నాయకులు

ప్రజాశక్తి - కదిరి టౌన్

గతంలో తాము కూడా ప్రభుత్వ బడిలో చదువుకొని ఈ స్థాయికి ఎదిగామని మున్సిపల్ ఛైర్‌పర్సన్ దిల్షాదున్నీసా బాహుద్దీన్, వైస్ ఛైర్‌పర్సన్ సుధారాణి బాబయ్య పేర్కొన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేసిన తల్లికి వందనం పథకం పై హర్ష వ్యక్తం చేస్తూ గురువారం కదిరి పట్టణంలోని మున్సిపల్ వీవర్స్ కాలనీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు , రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, విద్యా శాఖ మంత్రి లోకేష్, ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ చిత్రపటాలకు స్కూల్ కమిటీ చైర్మన్ జానికి బాయ్ ఆధ్వర్యంలో పిల్లలు వారి తల్లులు పాలాభిషేకం ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్ చైర్మన్లు సేగు సుధారాణి బాబయ్య, రాజశేఖర్ ఆచారి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతల్లికి వందనం పథకం కింద ప్రభుత్వం ఇచ్చిన నగదును సద్వినియోగం చేసుకొని, పిల్లలను ఉన్నత చదువులు చదివించి, ప్రయోజకుల్ని చేయాలని తల్లులను కోరారు. అదే విధంగా గతంలో కదిరి మున్సిపాలిటీ లో రెండు మాత్రమే ఉన్నత పాఠశాలలలు ఉండేవని ప్రస్తుతం ఈ విద్యా సంవత్సరం నుండి ఐదు పాఠశాలలను ఉన్నత పాఠశాలలుగా మంజూరు అయ్యేలా చొరవ చూపిన ఎమ్మెల్యే కందికుంటకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు కెవస్ బహవుద్దీన్, మున్సిపల్ కౌన్సిలర్లు బొబ్బిలి రవి, రమణా నాయుడు, మట్టి ఓం ప్రకాష్, బండారు మురళి, కె కిష్టప్ప, స్థానిక నాయకులు నరసింహులు, శ్రీరాములు, కష్ణ, మాజీ కౌన్సిలర్లు హుస్సేన్ భాష, మునిరత్నం, గంగిశెట్టి తెలుగుదేశం పార్టీ నాయకులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

తనకల్లు : మండలపరిధిలోని బాలసముద్రం పంచాయతీలోనీ అమడగూరు రోడ్డులోని చైతన్య విద్యా మందిరంలో గురువారం తల్లికి వందనం సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత మండల అధ్యక్షుడు కావిడి ప్రవీణ్ కుమార్, బాగేపల్లి అశోక్, చైతన్య స్కూల్ అధినేత తలమర్ల పవన్ కుమార్, తదితరులు పాల్గొన్నారు అదూ విధంగాబాలసముద్రం పంచాయతీలోనీ చంద్రబాబు నాయుడు కాలనీలోని శ్రీ సరస్వతి విద్య మందిరంలో గురువారం తల్లికి వందనం సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్ సోంపల్లి నాగభూషణం, మాజీ సర్పంచ్ గోవిందు, జనసేన మండల అధ్యక్షుడు కేవీ రమణ, శంకరప్ప వేణుగోపాల్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

క్షయ వ్యాధిపై అవగాహన

ప్రజాశక్తి - కొత్తచెరువు రూరల్

క్షయ వ్యాధిపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది పేర్కొన్నారు. కొత్తచెరువు మండల పరిధిలోని గౌనికుంటపల్లి గ్రామంలో టీబీ ముక్తా భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా డిటిసి సూపర్వైజర్ అబిద్ బాషా, సత్యవతి ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన కల్పించారు. క్షయ వ్యాధి పట్ల ప్రతిఒక్కరు అవగాహన కలిగి ఉండాలన్నారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించి ప్రజలు ఆరోగ్య వంతమైన జీవనం సాగించాలని కోరారు. ఈ కార్యక్రమములో ఎఎన్ఎం విజయ, శైలజ, ఆశాలు ప్రమీల , లక్ష్మీదేవి భారతి, 104 సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బాలికల సంరక్షణకు సురక్షితమైన వ్యవస్థ

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

బాల బాలికల కొరకు సురక్షితమైన వ్యవస్థను పునరుద్ధరించేందుకు ప్రతి అధికారి చర్యలు తీసుకోవాలని పుట్టపర్తి ఆర్డీవో సువర్ణ పేర్కొన్నారు. చిల్డ్రన్ ఆఫ్ ఇండియా ఫౌండేషన్, మిషన్ వాత్సల్య, ఐసిడిఎస్ సంయుక్తంగా పుట్టపర్తి ఎంపీడీవో కార్యాల సమావేశపు మందిరంలో పుట్టపర్తి డివిజన్ స్థాయి తహశీల్దార్లు, ఎంపిడిఒలు, ఎంఇఒలు, ఎస్ఐలు, శక్తి టీంసభ్యులు ఐసిడిఎస్ అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో సువర్ణ, ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి మాట్లాడుతూ పిల్లల హక్కుల విభాగం ప్రాముఖ్యత గురించి, బాల్య వివాహం నిలుపుదలలో అధికారుల భాధ్యత, బాల్య వివాహాలు పూర్తిగా రూపుమాపడానికి సూచనలు తదితర వాటిపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సిఐఎఫ్ జిల్లా కోఆర్డినేటర్ కొండప్ప, డిసిపిఒ మహేష్, ప్రొటెక్షన్ ఆఫీసర్ మహేష్, సోసియల్ వర్కర్ ఆనంద్, యూత్ అంబాసిడర్ సంజు తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో పాల్గొన్న అధికారులు

యోగాడేను విజయవంతం చేద్దాం

సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌డిఒ ఆనంద్ కుమార్

ప్రజాశక్తి-హిందూపురం

ఈనెల 21వ తేదీన జిల్లాస్థాయి లో హిందూపురం పట్టణంలోని ఎంజీఎం మైదానంలో జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవం కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని పెనుగొండ సబ్ కలెక్టర్ ఆనంద్ కుమార్, హిందూపురం మున్సిపల్ చైర్మన్ రమేష్ కుమార్ పిలుపునిచ్చారు. స్థానిక ఎంజిఎం మైదానంలో జరిగే యోగా డే కార్యక్రమంపై సబ్ కలెక్టర్ అధికారులతో కలిసి గురువారం మైదానాన్ని పరిశీలించి పలు సూచనలు చేశారు. అనంతరం మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున అధ్యక్షతన వివిధ శాఖల అధికారులు, సచివాలయ సెక్రటరీలతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో సబ్ కలెక్టర్ ఆనంద్ కుమార్, మున్సిపల్ చైర్మన్ రమేష్ కుమార్, డి ఆర్ డి ఏ. పి డి నరసయ్య, డి.ఎస్.పి మహేష్, జిల్లా ఉప విద్యాశాఖ అధికారిణితో పాటు ఇతర శాఖ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్, మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఈనెల 21వ తేదీన అంతర్జాతీయ యోగా దినోత్సవం ఏర్పాటు చేయాలని నిర్ణయించడం జరిగిందరన్నారు. ఈ యోగా కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ తో పాటు జిల్లా స్థాయి అధికారులతో పాటు ప్రజా ప్రతినిధులు పాల్గొంటున్నారన్నారు. ఇప్పటికే ఆయా శాఖల అధికారులకు ఇచ్చిన పనులను సకాలంలో పూర్తి చేయాలన్నారు. అదేవిధంగా విద్యాశాఖ అధికారులు వారి ప్రధానోపాధ్యాయులతో సమీక్షలు నిర్వహించుకుని ఉన్నత పాఠశాల విద్యార్థులను యోగా కోసం తీసుకురావాలన్నారు. ఆయా సచివాలయ పరిధిలో ఇప్పటికే రిజిస్టర్ చేసుకున్న వారిని సకాలంలో హాజరయ్యే విధంగా సచివాలయ ఉద్యోగులు చొరవ చూపాలన్నారు. మెప్మా అధికారులు యోగా కోసం రిజిస్టర్ చేయించిన మహిళలు అందరు యోగాలో పాల్గొనే విధంగా చూడాల్సిన బాధ్యత ఉందన్నారు. వచ్చే వారందరికీ తగిన సౌకర్యాలను ఏర్పాటు చేయాలని మున్సిపల్ అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే బాలకృష్ణ వ్యక్తిగత కార్యదర్శి వీరయ్య, జిల్లా ఉప వైద్యాధికారిణి మంజుల, మండల పరిషత్ అధికారిణి సరస్వతి, తహశీల్దార్ వెంకటేశు, పట్టణ సిఐలు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

యోగాంధ్రాలో అందరూ భాగస్వాములు కావాలి : రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ఈ నెల 21వ తేదీన నిర్వహిస్తున్న అంతర్జాతీయ యోగా దినోత్సవం లో అందరూ భాగస్వాములు కావాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారి సరస్వతి కోరారు. మండల, పంచాయతీ స్థాయి అధికారులు తప్పనిసరిగా తమ పరిధిలో యోగా నిర్వహణకు ఏర్పాట్లు చేసుకోవాలని తెలిపారు. హిందూపురం మండలానికి సంబంధించి మండల స్థాయి యోగా కార్యక్రమాన్ని మండల పరిధిలోని సంతేబిదనూరు జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించడం జరుగుతుందన్నారు. అన్ని శాఖల మండల స్థాయి అధికారులు, మండల స్థాయి ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు తప్పకుండా హాజరుకావాలని ఆమె తెలిపారు. దీనికి తోడు పంచాయతీ పరిధిలో పంచాయతీ కార్యదర్శులు విధిగా యోగా కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. స్థల ఎంపిక, వేదిక ఏర్పాటు, తాగునీటి సౌకర్యం వంటి మౌలిక సదుపాయాలను కార్యదర్శులు సమకూర్చుకోవాలని తెలిపారు. యోగా కార్యక్రమం తర్వాత వీడియోలు, ఫోటోలను యోగాంధ్రా యాప్ లో అప్ లోడ్ చేయాలన్నారు. అదే విధంగా యోగాలో పాల్గొన్న వారందరికీ తప్పనిసరిగా ధ్రువీకరణ పత్రాలను అందజేయాల్సి ఉంటుందని తెలిపారు.

నోటు పుస్తకాలు పంపిణీ

ప్రజాశక్తి - కదిరి టౌన్

హార్ట్ టూ హెల్ప్ చారిటబుల్ ట్రస్ట్ రవి నాయక్ ఆధ్వర్యంలో గురువారం మండల పరిధిలో లిచవిటి తండా, చిగురుమాను తండాకి చెందిన ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న 60 మంది విద్యార్థులకు నోటు పుస్తకాలు, పలకలు, పెన్సిలు, పంపిణీ చేశారు. చౌటుతండా ప్రాథమిక పాఠశాలలో నాల్గవ తరగతి చదివిన నలుగురు అమ్మాయిలకి గురుకులలో పాఠశాల సీటు సాధించినందున ఆ విద్యార్థినులను అభినందించి గోల్డ్‌మెడల్‌తో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మేనేజింగ్ ట్రస్టీ మూడే లక్ష్మీదేవి, ప్రధానోపాధ్యాయులు బాబా, ఉపాధ్యాయులు మౌలా, దేవేందర్ గ్రామస్తులు పాల్గొన్నారు.

పుస్తకాల పంపిణీలో విద్యార్థులు, నాయకులు, ఉపాధ్యాయులు

ఫీజుల దోపిడీని అరికట్టాలి

కదిరి టౌన్ : ఫీజుల దోపిడీకి పాల్పడుతున్న కార్పొరేట్ యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి శేషం మహేంద్ర డిమాండ్ చేశారు. కార్పొరేట్లో ఫీజులు దోపిడీ నిరసిస్తూ ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో విజయవాడలోని శ్రీ చైతన్య కళాశాల వద్ద శాంతియుతంగా ఆందోళన చేస్తున్న ఎఐఎస్ఎఫ్ నాయకుల పైన దాడి చేసిన పోలీసులు అధికారులను సస్పెండ్ చేయాలనీ కోరుతూ గురువారం కదిరి పట్టణంలోనీ శ్రీ చైతన్య విద్యాసంస్థ వద్ద నిరసన తెలిపారు . ఈ కార్యక్రమంలో నాయకులు గణేష్, పవన్, ఉమేష్, శివ, రాజేష్, సూరి తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసమస్యల పరిష్కారమే ధ్యేయం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - గాండ్లపెంట

ప్రజాసమస్యల పరిష్కారమే తమ ప్రధాన ధ్యేయమని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని మల్ల మీద పల్లి పంచాయతీలో నిర్వహించిన మన ఇంటికి మన ఎమ్మెల్యే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా అప్‌గ్రేడ్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన ప్రారంభించారు. అనంతరం కరణం వారి ఆడ మడకవారిపల్లి దళితవాడ మల్ల మీద పల్లి తదితర గ్రామాలలో పర్యటించి ప్రజాసమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దృష్టికి వచ్చిన సమస్యలపై ఆయా శాఖల అధికారులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటరామిరెడ్డి, తహశీల్దార్ బాబూరావు, ఏపీవో చంద్రశేఖర్, జేఈలు రెడ్డి ప్రసాద్ కిరణ్ కుమార్ రెడ్డి తదిర అధికారులతో పాటు ఎంపీపీ జి సోమశేఖర్ రెడ్డి, టిడిపి మండల కన్వీనర్ సి కొండయ్య, సర్పంచి శివప్ప నాయుడు, నరసింహం, వెంకటరామిరెడ్డి తదితరులతో పాటు ఆయా గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

స్థానిక నాయకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే